# ఆలయ ప్రతిష్ఠ

## 584 ప్రభువా నిన్ను స్తుతింతుము

రా -యదుకులకాంభోజి (చాయ : తనువు నాదిదిగో) తా -త్రిపుట

స్తుతియింతుమో ప్రభువా - శుభమౌ నీ దినమున - పరిశుద్ధమగు నీ నామము = గతకాలమున నీవు - పతితుల మగు మాకు - అతిదయతోఁ జేసిన - యన్ని మేలులు దలఁచి ॥స్తుతి॥

1. ఎన్న శక్యముగాక - యున్న మహిమతో వెలుఁగు - చున్న నీ పద సన్నిధిన్= సన్నుతాత్మా మేము - ఆత్మతో సత్యముతో - నిన్నారాధించుతము యీ - చెన్నౌ నీ గృహమందు ॥స్తుతి॥
2. ఇచట నీ వాక్యము - నుచితరీతిని చాట - నీ సేవకుల నందఱిన్ = శుచియౌ నీ యాత్మతో - పరిపూర్ణముగ నింపి - ప్రచురింపను శక్తి - నధిక ముగ నిమ్ము॥స్తుతి॥
3. భక్తితో నీ జనులు - యుక్తముగ నిను వేఁడ - శక్తి వారి కిమ్మెపుడు = ముక్తి కోసము నిన్నా - సక్తితో ప్రార్థింప - రక్తితో విని వారి - కానందమును గూర్చు ॥స్తుతి॥
4. జనక కుమారాత్మ - లను దేవ నీ కెప్పు - డెనలేని స్తుతి కల్గును = ఆనయము మేమిలలో - కొనియాడుటకు నిన్ను - ఘనుఁడా దీవెన మాపై - కుమ్మరింపుము వేగ ॥స్తుతి॥

-బి.ఇ. దేవరాజు

## 585 ఆలయ ప్రతిష్ఠ

రా -శంకరాభరణము (చాయ : రండి యుత్సహించి) తా -ఆది

ఈ గుడియందు ప్రవేశింపన్ - యేసుని బిలువగ రారండి = ఆయన రానిదె దీవెనలు - ఆశీర్వాదము లరుదగును ॥ఈ గుడి॥

1. ఆకా శము మన దేవునికి - అత్యున్నత సింహాసనము = పాదములకు యీ - భూమియును - పీఠముగా నొప్పును సుమ్ము ॥ఈ గుడి॥
2. ఆయన సన్నిధి కాంతియె యీ - ఆలయమంతట నిండుకొనన్ = ఆయన యాత్మ సహాయమున - ఆరాధనలను జరుపుటకై ॥ఈ గుడి॥
3. నిర్మలమైన సువార్తను బో - ధింపగ సాయము జేయుటకు = బోధకు లైన సువార్తికుల - బోధను నాటగ జేయుటకు ॥ఈ గుడి॥
4. ప్రార్థన విశ్వాసాయుతమౌ - భక్తిని నేర్పెడి నిలయముగ = భక్తులు దేవుని సన్నిధిలో - బాగుగ స్థిరపడ జేయుటకు ॥ఈ గుడి॥
5. ఈ పట్టణమున వెలుగుటకు - ఈ ప్రజలందరి రక్షణకు = ఈ గుడి యీ సభ బలపడుచు - సాగుచు వృద్ధిని జెందుటకు ॥ ఈ గుడి॥
6. బాప్తిస్మము నిర్ధారణలు - ప్రభు భోజన సంస్కారములు = బాగుగ జరుగుచుండుటకు - భక్తిని పెంపొందించుటకు ॥ఈ గుడి॥
7. తండ్రి కుమార శుద్ధాత్మకు - తావుగ నీ గుడియుండుటకు = త్రేకుని దీవెన వర్షములు - దీనిపై నిరతము కురియుగాక ॥ఈ గుడి॥

-సి. ఎం. రఫాయేలు



## 586 మందిరార్పణము

రా -యదుకులకాంభోజి (చాయ : పైనమైయున్నాను) తా -ఆది

యెహోవా నీ మహిమ స్తవము - యేసుని సుందర మందిరము - ఇది యెంతో నిత్య శుభకరము = సాహసమున క్రై - స్తవాళి తోడను - స్నేహ మమర నీ - శిష్యులు నిపు డీ - గేహమునకు భ -క్తిని జేరిరి నీ - బాహు బలముఁ గ - న్పడ దీవించుము ॥యెహోవా॥

1. ఆకాశము నీ సింహాసన మగు - నవని నీ యడుగుల పీఠముగ - నమరు దేవ నీ కెవ్వరు సాటి = నీ కొర కొక మం - దిర మొనరించుట - కీ [1]కుంభినిలో - నేరికి శక్యము - ప్రాకటమైనను - నీ [2]సద్భక్తా - నీకంబులె నీ - [3]నికేతనంబులు ॥యెహోవా॥
2. పరమండలంములం దుండి నీ - కరుణఁ జల్లి యీ యాలయము - పైని సుప్రకాశ మంపవె = తరతరముల క్రై -స్తవ సముదయములు - విరివిగ నీ మం - దిర భరితములై - చిరకాలము నీ - సేవ యొనర్పను - వరముల నిమ్మని - [4]నెరి బ్రార్థింతుము ॥యెహోవా॥

[1]భూమియందు. [2]యోగ్యమైన భక్తుల యొక్క సమూహములు. [3]గృహములు. [4]బాగుగా.